యర్రంశెట్టి శాయి

# హనీమూన్



# యర్రంశెట్టి శాయి

# హనీమూన్

-: ప్రచురణ :-
**ఇంద్రధనుస్సు పబ్లికేషన్స్**
3-2-57, శాతవాహన నగర్,
యల్.బి.నగర్, హైదరాబాద్-500 074.
సెల్ : 98482 64364

**HONEY MOON**
***by Yerramsetti Sai***

***© with author***
*No part of this book may be utilized in any form or by any means including electronic recording or retrieval system without permission in writing from the publishers.*

Price : 150/-

***Published by:***

***Books Available at*** :
Vishalandra Book House, Ph : 24744580.
Navodaya Book House, Ph : 24652387.
Navayuga Book House, Ph : 24754688.
Indradhanussu Publications, Cell : 98482 64364.
Telugu Book House, Cell : 9247446497.
Ganesh Book stall, Dilsukhnagar, Cell: 9393804466.
Gandhi Book Stall, Koti, Cell : 9293226169.

***DTP & Layout***
**Hari : 9393 5254 61**
Plot No. 18, Road No. 9, Christian Colony,
Hastinapuram, Vanasthalipuram East, Hyd-70.

***Printed at*** :

పెళ్ళయిన మొదటిరోజు మీరు మీ భార్యకు

వరం ఇస్తారు- హనీమూన్‌కి డార్జిలింగ్

వెళ్దామని! ఆక్షణం నుంచి అ అమ్మాయి

మిమ్మల్ని ముప్పయ్ తిప్పలు పెట్టి మూడు

చెరువుల నీళ్ళు తాగించేస్తుంది- హనీమూన్

విషయం గుర్తుచేసి! ఆ గొడవ భరించలేక

మీరు హనీమూన్‌కి ప్రోగ్రాం వేస్తారు. కానీ

బడ్జెటే డౌట్- మీకు మీ ఫ్రెండ్ సారధికూడా

తోడయితే అప్పుడు మొదలవ్వుతుంది-

అసలు సిసలు కామెడీ -

(దీనికితోడు చిన్నిగాడు, తాతయ్య ఎక్స్ట్రా)

మీక్కావలిసిన

కామెడీ నవలలు ఉచితంగా చదువ్కోడానికి

***www.yerramsettisai.com***

***or***

***www.indradhanussu.com***

విజిట్ చేయండి

హాపీగా నవ్వుకోండి

ముప్పై యేళ్ల కిందట లైఫ్ ఎలా ఉండేది?

గుర్తుంటే తల్చుకుంటూ చదవండి!

అప్పుడు మీరు లేకపోయినట్లయితే ఇప్పుడు

విజిట్ చేయండి!

# హనీమూన్

**నే**నూ సారథీ డార్జిలింగ్ వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. అందుక్కారణముంది. ఈ కరువుగొట్టు రోజుల్లో ఏ కారణమూ లేకుండా డార్జిలింగ్ లాంటి హిల్‌స్టేషన్ కెళ్ళాలనుకోవడానికి మేమేం లక్షాధికారులం కాదు. మావూలు మిడిల్‌క్లాస్ పక్షులం.

మేమిద్దరం చిన్నప్పటినుంచీ కలసి చదువుకున్నాం. కలిసే ఇంటర్లో తప్పాం! కలిసే మళ్ళీ పూర్తి చేశాం. అనుకోకుండా ఇద్దరికీ ఒకే వూళ్ళో ఉద్యోగాలు కూడా వచ్చాయ్, ఇద్దరికీ కొద్దిరోజుల తేడాలో పెళ్ళిళ్లయినాయ్.

మనదేశంలో సగటు మొగాడు పెళ్లాన్ని వరాలు కోరుకోమని అడిగేది పెళ్ళయిన మొదటిరోజే కథ! ఆ తరువాత వరాలు కోరాలనే కోరిక ఆవిడకూ, కోరుకోమని అడిగే ధైర్యం మొగాడికీ గారంటీగా ఉండవ్. మేమిద్దరం కూడా మా పెళ్ళినాటి రాత్రి భార్యలతో హనీమూన్ వెడదామని ప్రామిస్ చేశాం. అక్కడితో ఆగినా బాగుండేది.

"హనీమూన్ ఎక్కడికి?" అని వాళ్ళు అనుమానంగా అడిగినప్పుడు ఇద్దరం కూడా న్యూస్ పేపర్లో అంతకుముందే వెస్ట్ బెంగాల్ రాష్ట్ర టూరిజం శాఖవారి "డార్జిలింగ్ సందర్శించండి అద్భుతమయిన అనుభూతిని పొందండి" అనే ప్రకటన చూసి ఉండటం వల్ల – డార్జిలింగ్‌కి తీసుకు వెళ్తామని కమిట్ అయిపోయాం.

నిజానికి ఆ ప్రామిస్‌లూ, ఆ కమిట్‌మెంట్‌లూ ఇంకొకరయితే గుర్తుంచుకోరుగానీ మా భార్యామణులు మాత్రం ఆ విషయం అలాగే గుర్తుంచుకుని, వీలు దొరికినప్పుడల్లా సాధించడం గొణగడం ప్రారంభించారు. ముందూ వెనుకలు ఆలోచించకుండా అలా పెళ్లాలకు వరాలిచ్చేయడం ఎంత తప్పో, తీరా కమిట్ అయిపోయాక గానీ మాకు తెలిస్చావలేదు. ఇక చేసేదిలేక మాకున్న సంపదలన్నిటినీ సమీకరించి డార్జిలింగ్ వెళ్ళాడానికి నిశ్చయించుకున్నాం. ఇద్దరినీ పక్క పక్క ఇళ్లే కాబట్టి ఓ అదివారం నాడు ప్రయాణం తాలూకూ చర్చలకు మా ఇంటి వసారాలో సమావేశమయాం.

"ముందస్తుగా మనం అసలీ ప్రయాణం తలపెట్టడం మన ఆరోగ్యానికి మంచిదా కాదా అనే విషయం పరిశీలిద్దాం!" అన్నాడు సారథి.

"పోనీ ఈ విషయమంతా చూడ్డానికి ఓ కమిటీ వేయండి! గోంగూర ఫలానా సంవత్సరం ఎందుకు పండలేదు అన్న విషయం తెలుసుకోడానికి క్కూడా కమిటీలు వేస్తున్నారు కదా ఈరోజుల్లో" అంది మా ఆవిడ లోపల్నుంచి.

సంసారంలోకి రాజకీయాలు చొప్పించడం దానికి బాగా అలవాటు. వాళ్ళన్నయ్య

రెండుసార్లు మునిసిపల్ కౌన్సిలర్‌గా పోటీచేసి ఓడిపోవటం వల్ల వాళ్ళ కుటుంబం మొత్తానికి రాజకీయాలు బాగా తెలుసని దాని నమ్మకం.

"అసలు డార్జిలింగ్ వెళ్ళడానికి ఎంత ఖర్చవుతుందో ముందు లెక్కలు వేద్దాం!" అన్నాడు సారథి.

"అవును! అదే కరెక్ట్ ప్రొసీజర్!" అన్నాన్నేను.

"మీ ఫామిలీకీ, మా ఫామిలీకి కలిసి నాలుగు టికెట్లు" అన్నాడు వాడు.

"అంటే- ఎంతవుతుంది?"

వాడు ఆలోచనలో పడ్డాడు. గడప దగ్గరే నిలబడ్డ వాళ్ళావిడ ఫక్కున నవ్వింది.

"ఆ మాత్రం తెలీదా? ఒకరికెంతవుద్దో దానిని నాలుగుపెట్టి హెచ్చవేస్తే సరి" అంది తనో పేద్ద లెక్కల ప్రొఫెసర్‌లాగా. (వాళ్ళ నాన్న లెక్కల టీచర్ అవడం చేత ఆమెకూడా లెక్కల టీచర్‌లా బిహేవ్ చేస్తూంటుంది అప్పుడప్పుడూ)

"అవును! అలా చేస్తే ఈజీగా తెలిసిపోతుంది" అంటూ కాగితం తీసుకున్నాడు వాడు. తీరా లెక్క వేయబోయే సరికి అసలు ఒక్కరికే ఎంత ఛార్జీ అవుతుందో తెలీలేదు. ముందు అసలు ఒకరికి చార్జీ ఎంతవుతుందో ఎలా తెలుసుకోవటం?" వాళ్ళావిడని అడిగాడు వాడు.

"అదికూడా తెలీదా? నలుగురికీ ఎంతవుతుందో, దానిని నాలుగుపెట్టి డివైడ్ చేస్తే వస్తుంది" అందామె.

"ఏడ్చినట్లుంది ఇంక నువ్వు లోపలికెళ్ళు" అన్నాడు సారథి కోపంగా.

"ఆ మాటమీదే ఉండండి- కాఫీలనీ, టీలని మరోసారి పిలిచారంటే చూడండి- ఏం జరుగుతుందో" అనేసి కోపంగా లోపలి కెళ్ళిపోయిందామె.

"ఛార్జ్ ఎంతో తెలుసుకోవాలంటే – బెస్ట్ థింగేమిటంటే- రైల్వే ఎంక్వయిరీస్‌కి ఫోన్ చేసి తెలుసుకోవటం " అన్నాన్నేను.

కానీ మరి ఫోన్ మా ఇద్దరిళ్ళల్లోనూ లేదు. మా ఎదురింటి ప్లీడర్ గారికి ఉంది. కానీ – అది కొంచెం రిస్కీ వ్యవహారం. ఆయన దగ్గరకు మనం వెళ్ళేమాట అటుంచి ఆయన రోడ్డుమీద వస్తుంటే- పరిచయస్తులూ, స్నేహితులూ చెల్లాచెదురయి సమీపంలో ఉన్న సందుల్లోకి గానీ, ఇళ్ళల్లోకి గానీ పారిపోవటం మా వూళ్ళో కనపించే అధ్భుత ప్రకృతి దృశ్యాలలో ఒకటి. బ్రహ్మదేవుడు ఓ జలగని సృష్టించాలని ముచ్చటపడి- ఇంచుమించుగా ఆ కార్యక్రమం పూర్తిచేసి, ప్రాణం పోయిబోయే సమయంలో హఠాత్తుగా మనసు మార్చుకుని దాన్ని మనిషిగా మార్చాడనీ, ఆ మనిషే ప్లీడర్‌గారనీ ఆయన విషయం తెలిసిన వారందరికీ నమ్మకం. మూడు రకాల న్యూస్ పేపర్లు కొని వాటిల్లో వార్తలను

పోల్చిచూస్తూ, కనబడ్డ ప్రతివారికీ చదివి వినిపిస్తూ, వాటికి తన వ్యాఖ్యలను జోడిస్తూ– వీరవిహారం చేయటం ఆయన హాబీ! అయితే తమాషా ఏమిటంటే ఈ విషయం ఊరందరికీ తెలిసినా ఎవరో ఒకరు రోజూ ఆయనకు దారణంగా బలయిపోతూనే ఉంటారు. ఆ రోజు మావంతు వచ్చింది కనుక చేసేదేమీలేదని ఊహించుకుని మేము ఆయనింటికి వెళ్ళాం. మమ్మల్ని చూడగానే చేతిలోని తెలుగు పేపర్ ఆనందంగా మడిచేశాడతను.

"రండి రండి రండి రండి రండి" అన్నాడు సంబరంగా. మా గుండెలు గుభేల్ మన్నాయిగానీ పైకిమాత్రం చిరునవ్వు నవ్వుతూ 'నమస్తే' అన్నాం.

"నమస్తే నమస్తే నమస్తే - కూర్చోండి కూర్చోండి, కూర్చోండి" అన్నాడాయన. ఆయన కెదురుగ్గా ఉన్న బలి పీఠాలమీద కూర్చున్నాం.

"నేను చెప్తూనే ఉన్నానుకదా! ఎవరైనా వినిపించుకున్నారా? ఒక్కడైనా నా ఉత్తరాలు కేర్ చేశాడా? రాజీవ్‌గాంధీకి స్వయంగారాశాను. ఆ బ్రిటిష్ తొత్తు కొడుకులను నమ్మవద్దనీ– వాళ్ళతో దౌత్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలనీనూ! విన్నారా? ఒక్కడయినా– వీడెందుకిలా ఉత్తరాలు రాస్తున్నాడని ఎంక్వయిరీ చేశారా? లేదు! నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు! ఇప్పుడేమైంది? ఆ బ్రిటిష్ దొంగ వెధవలే– జగ్‌జిత్‌సింగ్ చౌహాన్‌ని బాహాటంగా రెచ్చగొడుతున్నారు! ఖలిస్తాన్‌ని సమర్ధిస్తున్నారు. టెర్రరిజాన్ని పోషిస్తున్నారు. 'హిందూ' లో ఏమి రాశాడో చూశారా?"

"చూశామండీ– ఇప్పుడే చదివి వస్తున్నాం" అన్నాడు సారధి చప్పున అబద్ధమాడేస్తూ–

"అయితే ఎక్స్‌ప్రెస్ చదివి వుండరు! ఎడిటోరియల్లో ఏం రాశాడు? - నేను రాజీవ్‌గాందీకి రాసిన వుత్తరంలో మేటరే వాడూ రాశాడు! అంటే అర్థం ఏమిటి?"

"గొప్పవాళ్లంతా ఒకే విధంగా ఆలోచిస్తారని అర్థం సార్–" అన్నాను నేను ఉత్సాహంగా.

"ఎగ్జాక్ట్‌లీ! అయినాగానీ జరుగుతోందేంటి? నాలాంటి వాళ్ళ వుత్తరాలు చింపి అవతల పారేస్తారు. అదే ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌వారు రాస్తే జాగ్రత్తగా చదువుతారు. రియాక్ట్ అవుతారు. యేదొకటి చేస్తారు– వాటీజ్ దిస్ నాన్సెన్స్?"

"యస్సార్– హారిబుల్ స్టేట్ ఆఫ్ ఎఫైర్స్" అన్నాడు సారధి. అదే అవకాశమని నేను నెమ్మదిగా ఫోన్ సంగతి మొదలుపెట్టాను.

"సార్– ఓసారి మీ ఫో..."

"వాటెబౌట్ శ్రీలంకా?" ఈనాడు పేపర్ తీసి మా ముందుకి విసిరిగొట్టాడాయన "చూడండి– అందులో ఏమి రాశారో–"

"మీ ఫోన్..." అన్నాడు సారధి ఈనాడు అందుకుంటూ.

"డోంట్ బాదర్ ఎబౌట్ మై ఫోన్- అదెప్పుడూ మోగుతూనే ఉంటుంది. వాటెబౌట్ శ్రీలంకా? అదో పెద్ద తలనొప్పి వ్యవహారంగా తయారవుతుందనీ, మన ప్రభుత్వం రాంగ్‌స్టెప్ వేస్తోందనీ నేనప్పుడే నాయుడుగారికి చెప్పాను. చెప్పానో లేదో మీరే అడగండి- అయనింట్లోనే ఉంటారిప్పుడు"

"అబ్బే- అదివరకే అడిగాం సార్- మీరు చెప్పారని ఆయన అప్పుడే చెప్పారు-"

"సార్- మీ ఫోన్ ఓసారి-" అన్నాన్నేను పట్టువిడవని విక్రమార్కుడిలా.

అప్పుడు స్పృహలో కొచ్చాడాయన.

"ఏమిటి నా ఫోన్?"

"ఓసారి ఫోన్ చేయాలండీ అర్జంటుగా"

"అలాగా! మరి వచ్చి ఇంతసేపయినా ఆ విషయం చెప్పరేం? తీసుకోండి- చేసుకోండి - అస్సాంలో ఈ రోజున పరిస్థితేంటో తెలుసా?"

"తెలుసండి" అన్నాడు సారథి కంగారుగా. లేకపోతే ఇప్పుడు మళ్ళీ ఆ విషయం ఎక్కడ మొదలుపెడతాడోనని.

"తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తెలుసండీ!"

"ఎలా తెలుసు? ఇవాళేగా టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఆర్టికల్ వచ్చిందీ?"

సారథికేం చెప్పాలో తెలీక నావేపు చూశాడు.

"మీరే చెప్పారండీ ఆ మధ్య!"

"నేనా? నేనూ ఇవాళేగా ఆ ఆర్టికల్ చదివిందీ?" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఏమోనండీ! అయినా మీరు ఆర్టికల్ చదవాల్సిన పనేముందండి? పదిరోజుల తరువాత పేపర్ వాళ్లు రాయబోయేది మీరివాళే చెప్పగలరు"

ఆ మాటతో ఆయన మొఖం గర్వంతో వెలిగిపోయింది.

"ఆఫ్‌కోర్స్, ఆఫ్‌కోర్స్"

నేనీలోగా రైల్వే ఎంక్వయిరీస్‌కి ఫోన్ చేశాను.

"హలో- " అన్నాను. రైల్వే ఎంక్వయిరీస్‌లో ఎప్పుడూ ఓ కర్ణకఠోరమయిన మొగగొంతు తెలుగులాంటి భాష మాట్లాడుతూండేది. ఈసారి ఆడగొంతు వినిపించేసరికి ఆశ్చర్యం వేసింది.

"...స... సంగతేమిటంటే..." అని తడబడుతూ చెప్పబోయే సరికి ఆ గొంతు ఠక్కున అడ్డుపడిపోయింది.

"ఓ! సంగీత కావాలా? ఒక్క నిమిషం ఉండండి! ఆమె కూడా మీ ఫోన్ కోసమే

ఎదుర్చూస్తోంది– ఏయ్ సంగీతా– నీ డార్లింగ్ ఫోన్‌లో ఉన్నాడు" అంటూ అరిచిందా పిల్ల.

"నేను గాబరాపడి "హలో... హలో... మేడమ్..." అంటూ కొద్దిక్షణాలు అరిచాను గానీ లాభం లేకపోయింది. ఈలోగా ఆ సంగీత అనే పిల్ల కాస్తా ఫోన్‌లో కొచ్చేసింది.

"హలో డియర్! ఏమిటింత ఆలస్యం? ఇప్పుడా నేన్నీకు గుర్తు కొచ్చింది?" అందామె నిష్ఠూరంగా.

"చూడండి మేడమ్! నేను మీరనుకుంటున్న వ్యక్తిని కాదు– ఇంతకుముందు ఫోన్ తీసుకున్న అమ్మాయి...."

"మా ఫ్రెండే డియర్! మన సంగతంతా ఆమెకు తెలుసులే– ఏం ఫర్వాలేదు!"

నాకేం మాట్లాడాలో తెలీడంలేదు. అయోమయంగా సారధి వేపు చూశాను.

"ఏమిటి కన్‌ఫ్యూజన్?" అడిగాడు వాడు నా అవస్థ కనిపెట్టి.

"మరేం లేదు– ఎవరో పిల్ల ఫోన్లోకొచ్చి "హలో డియర్" అంటోంది–"

"అదా–" తేలిగ్గా అన్నాడు వాడు. "ఇది రైల్వేలో కర్టెసీ వీక్‌లే! ఈ వార మంతా వాళ్ళు ప్రయాణీకులతో చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. ప్రేమగా మాట్లాడతారు. అంచేత అది సహజమే! ఇలా ఎంక్వయిరీకి ఫోన్ చేసి వారందరిని 'డియర్' అనాలని వాళ్ళకి రైల్వేబోర్డ్ నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చి ఉంటాయ్–"

ఆ మాట నిజమేనేమో ననిపించింది నాకు.

"మీ కర్టెసీకి చాలా థాంక్స్!" అన్నాను ఆ అమ్మాయితో.

"అలా టైమ్ వేస్ట్ చేయకు డియర్! త్వరగా రా ఇక్కడకు, సినిమాకి టైమయిపోతోంది."

నేను మళ్ళీ కంగారుగా సారధివేపు చూశాను.

"ఇదేమిట్రా? రైల్వేవాళ్ళు కర్టెసీవీక్‌లో ప్రయాణీలను సినిమాలకు కూడా తీసుకెళ్తారా?"

వాడు ఓ క్షణం ఆలోచించాడు.

"ఇంతకు ముందయితే ఆ పద్ధతి లేదుగానీ ఇప్పుడు ప్రైవేట్ బస్‌ల వాళ్లతో పోటీ పెరిగిపతోంది కదా! అంచేత కొత్తగా ఈ సిస్టమ్ ప్రవేశపెట్టి ఉండవచ్చు–" అన్నాడు.

పేపర్లో ఆ వార్తలో మునిగిపోయిన ప్లీడర్‌గారు హఠాత్తుగా అరచారు.

"అందాకా ఎందుకు? తమిళనాడు సంగతేమిటి? ఏమ్జీఆర్ గవర్నమెంటే రాష్ట్రంలో బంద్ చేయించింది! ప్రభుత్వమే బంద్‌లు చేసి ప్రజా జీవితాన్ని స్తంభింపజేసే సంఘటన ప్రపంచంలో ఇంకెక్కడా జరగలేదింతవరకూ."

నేను చప్పున మళ్ళీ ఫోన్లో మాట్లాడేయసాగాను.

“హలో – మీ ఆఫర్‌కి చాలా థాంక్స్ మేడమ్!” అన్నాను పొలైట్‌గా.

“రాజ్! జోక్ చేయడం చాలిక! వెంటనే వస్తున్నావా లేదా? అవతల సినిమాకి టైమయిపోతోంది”

నాకు చిరాకు పుట్టుకొచ్చింది. ఎంత “కర్టెసీవీక్” అయినా ఇలా బలవంతంగా, దబాయించి సినిమాకు రమ్మంటే ఎలా?

“నేఁరాను” అన్నాను కోపం అణచుకుంటూ.

“ఎందుకని?” ఆశ్చర్యంగా అడిగిందామె.

“నాకిష్టం లేదు! ఇంక ఈ సినిమా గొడవ ఆపేసి నాక్కావలసిన ఇన్‌ఫర్మేషన్ ఇవ్వండి.”

ఆమె ఓ క్షణం తటపటాయించింది.

“మీక్కావలసిన ఇన్‌ఫర్మేషనా?”

“అవును?”

“ఏమిటది రాజ్?”

“నా పేరు రాజ్ కాదు! ఇంకోసారి ఆ పేరుతో పిలిచారంటే బాగుండదు.”

“మీ పేరు రాజ్ కాదా?”

“ఏ మాత్రం కాదు.”

“మైగాడ్.”

“నా పేరు అదికూడా కాదు. అసలు మీరు మాట్లాడేది రైల్వే ఎంక్వయిరీస్ నుంచేనా?” అనుమానంగా అడిగాను.

“మైగాడ్– ఇది వర్కింగ్ ఉమెన్ హాస్టలండి” నేను షాకయ్యాను.

“అయితే ఫోన్ పెట్టేయండి! రాంగ్ నెంబర్–”

ఆమె ఫోన్ డిస్కనెక్ట్ చేసేసింది. ఈసారి జాగ్రత్తగా రైల్వే ఎంక్వయిరీస్ రింగ్ చేశాను. ఆ నెంబర్ రింగ్ అసలేదుగానీ హఠాత్తుగా ఎవరో ఇద్దరు మాట్లాడుకోవటం వినిపించసాగింది ఫోన్లో...

“.... చింతపండూ అంతే! ధర తెగ పెరిగిపోయింది?”

“ఫెరిగిపోయిందా?”

“రెండు రెట్లు!”

“నీ దగ్గర స్టాకెంతుంది?”

“వుద్దరు.”

“వుద్దరా– తీవురుండాలిగా.”

“తీవురు లేదు, ఉద్దరే.”

"మిరపకాయలు."

"భగ్దరు."

"భగ్ధరా- అబ్బ బెల్లం?"

"ఛబ్బరు."

"అబ్బ?"

నాకు విసుగేసు కొచ్చింది "హలో" అన్నాను కల్పించుకుంటూ.

"ఎవరండీ హలో అంది?" అంది ఓ గొంతు.

"ఎవరో మాట్లాడినట్లుంది." అంది ఇంకోగొంతు.

"మధ్యలో ఇంకొకరు ఎలా మాట్లాడగలరు?"

"ఏమోమరి? హలో అని వినిపించింది."

"హలో" అన్నాను నేను మళ్ళీ.

"అగో - చూశావా! మళ్లీ హలో అంటున్నా డెవడో."

"ఎవడాడు.?"

"ఏమో- దొంగనాయాలు! మధ్యలో వచ్చిందే కాకుండా పైగా హలో హలో" అంటున్నాడు"

"ఇలాంటి వెదవలెక్కువయి పోయారీ మధ్య! మొన్న మా ఆవిడతో బ్లాక్ మనీ నూతిగట్టుకింద తవ్వి పెట్టమని రహస్యంగా చెప్తోన్నప్పుడు కూడా 'హలో' అన్నాడెవడో."

"ఎవడాడు? ఇప్పుడు హలో అంటున్నావాడు కాదు గదా."

"హలో- హలో" కోపంగా అరిచాన్నేను.

"అదిగో- చూశావా, మళ్ళీ అరుస్తున్నాడు వాడు."

"దొంగనాయాలు."

ఫోన్ డిస్కనెక్ట్ చేశాను కోపంగా.

హఠాత్తుగా ప్లీడర్‌గారు అరిచారు మళ్ళీ.

"చూడండి! ఇందులో ఏమీ రాశాడు? "స్వాధీనం తప్పిన గుజరాత్ ఆందోళన" సెంట్ పర్సెంట్ కరెక్ట్.. నేనెప్పుడో చెప్పాను."

"అవును" ఒప్పుకున్నాడు సారధి.

నేను వినిపించుకోనట్లు మళ్ళీ రైల్వే ఎంక్వయిరీస్ రింగ్ చేశాను.

"గుడ్ మాణింగ్- రైల్వే ఎంక్వయిరీస్" అంది కర్ణకఠోర మావూలుగా.

"గుజరాత్ ఆందోళన తగ్గాలంటే ఏంచేయాలి?" హఠాత్తుగా గట్టిగా అరిచారు ప్లీడర్‌గారు.

"మాకేం తెలుస్సార్?" చిరాగ్గా అన్నాడు ఎంక్వయిరీక్లర్క్.

నేను ఉలిక్కిపడ్డాను.

"అబ్బే! మిమ్మల్ని కాదండీ! మా జలగ- సారీ- మా ప్లీడర్ గారు మాతో మాట్లాడుతూంటే- మీకు వినిపించింది- సారీ."

"ఫర్లేదులెండి అప్పుడప్పుడూ ఇలాంటి పొరపాట్లు మావూలే."

"థాంక్యూ వెరీమచ్."

"మెన్షన్ నాట్" అనేసి ఫోన్ పెట్టేశాడతను. నేనూ డిస్కనెక్ట్ చేశాకగానీ గుర్తురాలేదు- అసలు విషయం అడగలేదని.

"సరే- ఆ సంగతలా వదిలేయండి? టెలిఫోన్ టాపింగ్ సంగతేంటి? ఎంత గవర్నమెంటయినా ప్రతిపక్ష నాయకుల ఫోన్స్ టాపింగ్ చేస్తుందా? ఎంత సిగ్గుచేటు?"

"చాలా సిగ్గుచేటండీ?"

"ఆరోజు ఫ్రీప్రెస్ జర్నల్ వాడు రాసిన ఎడిటోరియల్ చూశారా?"

"చూళ్ళేదండీ?"

"ఇప్పుడే తెస్తాను" అంటూ లోపలికెళ్ళాడాయన.

"కమాన్! పరుగెత్తు- ఆయన బయటకొచ్చేలోగానే సందు మలుపు తిరిగేయాలి మనం! బ్రతికుంటే బలుసాకు తినవచ్చు" అన్నాడు సారధి.

ఇద్దరం నిజంగానే చాలా వేగంగా పరుగెత్తి మెయిన్ రోడ్మీద కొచ్చేశాం.

"అమ్మయ్య గొడవొదిలిపోయింది." అన్నాడు వాడు.

"చాలా తెలివిగా వ్యవహరించబట్టి సరిపోయింది."

"ఇంతకూ డార్జిలింగ్ ఛార్జీ ఎంతట?"

"నాకేం తెలుసు?"

"అదేమిటి? ఎంక్వయిరీకి రింగ్ చేశావుగా?"

"దొరక్క దొరక్క దొరికితే ఆ ప్లీడర్ మధ్యలోఅరచి చెడగొట్టేశాడు కదా!"

"అఘోరించినట్లుంది" అన్నాడు సారధి విసుగ్గా.

"అవును!" ఒప్పుకున్నాను.

"టీ తాగి హొటల్ నుంచి చేద్దాం పద! ఈసారి నేనే చేస్తాను! నీకు సరిగ్గా చేతకావటంలేదు" అన్నాడు వాడు.

"సరే... నీ యిష్టం!"

ఇద్దరం ఆ పక్కనే ఉన్న హొటల్లోకి దూరాం.

అప్పుడే సర్వర్ వేడిగా ఉల్లిపాయ గారెలు తెచ్చి గుమ్మరించాడు ఆల్మారాలో.

వాటిని చూడగానే నాకు నోరూరింది.

"సరే... నువ్వెళ్ళి ఫోన్ చేసిరా! నేనీలోగా ఓ ప్లేట్ గారెలు లాగించేస్తాను" అన్నాను ఓ టేబుల్ దగ్గర సెటిలవుతూ. వాడు అందుకు ససేమిరా వప్పుకోలేదు. ఆ వేడి గారెలు ఇద్దరం తిన్నాకే ఫోన్ చేయవచ్చు, ఇప్పుడేం మునిగిపోలేదన్నాడు. ఇద్దరం చెరోప్లేటూ తినేశాం! ఈలోగా సర్వర్ వన్ బై టూ టీ తెచ్చి మా ముందుంచాడు.

"మనం వన్ బై టూ తగుతామని సర్వర్ కెలా తెలుసు" సారథి నడిగాను ఆశ్చర్యంగా.

"బిల్లులో టాక్స్ వేస్తున్న దగ్గర్నుంచీ ఎవ్వరూ ఫుల్ టీ తాగటం లేద్సార్..." అన్నాడు సర్వర్ చిరునవ్వుతో.

"ఒకవేళ ఒక్కడే హోటల్ కొస్తే?"

"మరో ఒంటరి కస్టమర్ వచ్చేవరకు ఆగి- అప్పుడు ఇద్దరూ కలసి వన్ బైటూ తాగుతారండీ!"

ఇద్దరం టీ తాగాం. నేనే మళ్ళీ కౌంటర్ మీదున్న ఫోన్ అందుకున్నాను. అయితే ఓ పక్క సినిమా రికార్డులు, సర్వర్ల అరుపులు మరీ గొడవగా ఉన్నాయ్.

గొప్ప ఆశ్చర్యం ఏమిటంటే- నేను రైల్వే ఎంక్వయిరీస్‌కి రింగ్ చేస్తే- నిజంగానే రైల్వే ఎంక్వయిరీస్ ఫోన్లోకి రావటం!

"రైల్వే ఎంక్వయిరీస్ ప్లీజ్-" అంది ఏమాత్రం ప్లీజింగ్‌గా లేని గొంతు ఒకటి.

"హలో- ఇక్కడినుంచి- చేతిలో చెయ్యేసి చెప్పుబావా- (సినిమా పాట అడ్డుపడిపోయింది) డార్జిలింగ్ ఉల్లిపాయ ఆమ్లేట్ ఒకటీ- (సర్వర్ కేక)

"ఇది రైల్వే ఎంక్వయిరీస్, హోటల్ కాదు" కోపంగా అన్నాడా క్లర్క్.

"హలో- కోప్పడకండి బాబూ! నేను హోటల్ నుంచి సాయంకాలం- టంటటీ, సాగరతీరం- టంటటీ- (సినిమాపాట) హలో- నేను హోటల్నుంచీ మాట్లాడుతున్నాను! టమాటో ఊతప్పా రెండూ - అందుకని డిస్టర్బెన్స్‌గా ఉంది."

"మీకేం కావాలి?" విసుగ్గా అడిగాడతను.

"పూరీ కూర్మా రెండూ- (సర్వర్ కేక) ఇక్కడి నుంచీ సాగతరతీరం టంటంటం - డార్జిలింగ్‌కి సాగరతీరం టంటంటం చెలి కౌగిట్లో - ఛార్జీ ఎంతో చెప్తారా?- కానీ వితవుట్ షుగర్, ఒన్ బై- టూ"

"కృష్ణా ఎక్స్‌ప్రెస్ గంట లేదు-" అన్నాడతను.

"నేనడిగేది కృష్ణా ఎక్స్‌ప్రెస్ గురించి కాదయ్యా- మషాలా దోసె ఒకటి!" గట్టిగా అరిచాను.

"వేరే ఫోన్లో మాట్లాడుతున్నాను సార్! ఒక్క నిమిషం ఆగండి!"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Honeymoon**

* * *